www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 3 నవంబర్ 2023
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



జనారణ్యంలోకి జింక..!

తోటపల్లిగూడూరు: జనారణ్యంలోకి ఓ జింక ప్రవేశించింది. ఎక్కడ నుంచి వచ్చిందో తెలియదు గానీ గురువారం కుక్కల దాడి నుంచి తప్పించుకొన్న ఆ జింక తోటపల్లిగూడూరు మండలం వెంకన్నపాలెం గ్రామంలో రైతు సోము వెంకటేశ్వర్ రెడ్డి రొయ్యల చెరువులో పడింది. చెరువులో పడ్డ ఆ జింకను రైతు వెంకటేశ్వర్ రెడ్డి కాపాడి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. డిఎఫ్ఒ ఆవుల చంద్రశేఖర్, రేంజర్ మాల్యాద్రి ఆదేశాల మేరకు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పి. బాలకృష్ణయ్య, ఎఫ్బిఒ శ్రీనివాసులు జింకను స్వాధీనం చేసుకున్నారు. కుక్కల దాడిలో తగిలిన స్వల్ప గాయాలకు కోదూరు పశువైద్యశాలలో చికిత్స చేయించారు. అనంతరం నరసింహకొండ ప్రాంతంలో జింకను విడిచి పెట్టినట్లు సెక్షన్ ఆఫీసర్ బాలకృష్ణ తెలిపారు.



జింకను స్వాధీనం చేసుకున్న అధికారులు

'సింహపురి'పై కరువు ఛాయలు..!

- 36 మండలాల్లో వర్షభావ పరిస్థితులు
- ఆకాశం వైపు ఆశగా చూపులు
- ప్రభుత్వ ప్రకటనలో మొండిచేయి

సింహపురిపై కరువు ఛాయలు అలముకుంటున్నాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు,ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. మెట్ట ప్రాంతాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలకు సాగునీరు అందడం లేదు. జిల్లా సాధారణ వర్షపాతం 1080 మిల్లీ మీటర్లు. జిల్లాలోని 38 మండలాల్లో అతితక్కువ వర్షపాతం నమోదైంది. 20 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. 3 మండలాల్లో అతిక్కువ నమోదైంది. 13 మండలాల్లో సాధారణ వర్షపాతం ఉంది. 38 మండలాల్లో కేవలం రెండు మండలాలు మాత్రమే సాధారణ పరిస్థితులున్నాయి. 36 మండలాల్లో కరువు ఛాయలు కనిపిస్తున్నాయి. నవంబర్, డిసెంబర్‌లలో వచ్చే వర్షాల వైపు చూస్తున్నారు. ప్రభుత్వ కరువు మండలాల జాబితాల్లో ఒక్క మండలం కూడా నమోదు కాలేదు.

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాల ప్రకటన చేసింది. ఇందులో జిల్లాకు అన్యాయం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రుతుపవనాలు ఆలస్యం కావడంతో జిల్లా రైతాంగం వర్షాలు కోసం ఎదురుచూ స్తున్నారు. ప్రస్తుతం ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో జిల్లాలోని అనేక మండలాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. జిల్లాలో రైతుల పంటలు ఎండిపోతున్నాయి. బోర్లు ఎండిపోతున్నాయి. వేలాది రూపాయలు ఖర్చుచేసి వేసిన బోర్లు 150 అడుగులకు నీటి మట్టం పడిపోయింది. జిల్లాలోని ఆత్మకూరు, వింజమూరు, ఎఎస్‌పేట, కనిగిరి, దుత్తలూరు, సీతారామపురం, వలేటివారిపాళెం, మండలాల్లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. వర్షాలు ఆశించిన స్థాయిలో ఇప్పటి వరకు రాలేదు. జిల్లాలో సాధారణ వర్షపాతం 1080 మిల్లీమీటర్లు, 38 మండలల్లో 13 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. వలేటివారిపాళెంలో -66.9 శాతం , వింజమూరు -68. శాతం, వరి కుంటపాడు -78.8 : తీవ్రమైన పరిస్థితులు న్నాయి. దాదాపు 36 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. కేవలం రెండు మండలాల్లో మాత్రమే కందుకూరు, ఉలవపా డులో మాత్రమే ఎక్సెస్ వర్షపాతం నమోదైంది. జూన్, జులైలలో కొంత వర్షం వస్తుంది. దీని కారణంగా భూగర్భ జలాలు పెరుగుతోంది. ఈ ఏడాది ఆ పరిస్థితి రాలేదు. జిల్లాలో అక్టోబర్, సెప్టెంబర్, నవంబర్‌లలో వర్షాలు వస్తాయి. రెండు నెలల నుంచి వర్షాల కోసం ఎదరు చూస్తున్నా పెద్దగా కురవలేదు. మెట్ట ప్రాంత రైతుల పంటలు ఎండిపోతున్నాయి.

కరువుఛాయలు..!

జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో 20 మండలాల్లో తీవ్ర పరిస్థితులుండగా, వింజమూరు, వరికుంటపాడు, వలేటివారిపాళెం, ఆత్మకూరు, ఎఎస్‌పేట, మర్రిపాడు ప్రాంతాల్లో పంటలు ఎండి పోతున్నాయి. నిమ్మ, పత్తి, మొక్కజొన్న, పొగాకు పంటలు నిలువునా ఎండిపోవడంతో రైతులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. ఇప్పటికే లక్షల రూపాయలు నష్టపోయారు. ఎఎస్‌పేట మండలంలోని తాతిరెడ్డిపల్లి, జువ్వల గుంటపల్లి, హసనాపురం, వింజ మూరు మండలం చంద్ర పడియా,తోపాటు అనేక ప్రాంతాల్లో వేలాది ఎకరాలు నీరు లేకపోవడంతో ఎండిపోతున్నాయి. ఇప్పటికే నష్టపోయిన రైతుల గురించి ప్రభుత్వం పట్టించుకోలేదు. కనీసం నివేదక తయారుచే యలేదు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో రైతులు తమ కష్టాలు చెప్పుకున్నా పట్టించుకున్న పరిస్థితులు లేవు. వ్యవసాయ అధికారులు రికార్డులు తయారుచేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కరువు మండలాలు ప్రకటనచేసింది. వర్షాలపై ఆశలు పెట్టుకున్నా ఇప్పటికే తీవ్రంగా నష్టపోయిన రైతులను గుర్తించడం లేదు. కనీసం రికార్డులు లేవు. కరువు కారణంగా పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతుల కష్టాలను ప్రభుత్వం గాలికొదిలేసింది. పరిస్థితి ఉంటే జిల్లా మొత్తం కరువులో పడిపోయే ప్రమాదం ఉంది.

ఆత్మకూరు ప్రాంతంలోని మెట్ట ప్రాంతాల్లో పంటల వేయలేని కరువు పరిస్థితులు

పేద ప్రజల ఆత్మబంధువు 'జక్కా'..!

కమ్యూనిస్టు యోధుడు..పేద ప్రజల ఆత్మ బంధువు. నెల్లూరు జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో కలికితురాయి...పేద దళితబహుజనుల అలుపెరగని పోరాట ధీరుడు...పేద ప్రజల ఆశాజ్యోతి.. కార్మిక, కర్షక, కష్టజీవులకు కొండంత అండ...బడుగు, బలహీనవర్గాలకు ఆప్తుడు.. ఉద్యమాల రూపశిల్పి.. రాజకీయ నేతలకు జక్కా వెంకయ్య... పేద ప్రజలు, కార్మికులు, కష్టజీవులకు వెంకన్న ఆప్తులకు జెవి. సింహపురిలో పేదల ప్రతినిధిగా ఏడు దశాబ్దాలు అలుపెరగని పోరాటం చేసిన ధీరుడు జక్కా వెంకయ్య...1930 నవంబర్ 3 జన్మించిన ఆయన కడవరకు కమ్యూనిస్టుగా, నిజాయితీ, నిబద్ధత, నిక్కచ్చితనంతో జీవించారు. 2018 మే 29న మృత్యువుతో పోరాడుతూ తుది శ్వాస విడిచారు. నేడు ఆయన 93వ జయంతి ఈ సందర్భంగా 'ప్రజాశక్తి' ప్రత్యేక కథనం.

- కడదాక కమ్యూనిస్టుగా నిబద్ధత
- ఉద్యమ రూపకల్పనలో ఆయనకు సాటి ఎవరు ..
- నేడు 93వ జయంతి



జక్కా వెంకయ్య, సిపిఎం సీనియర్ నేత

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి :సిపిఎం సీనియర్ నాయకులు జక్కా వెంకయ్య సింహపురి రాజకీయ చరిత్రలో ఒక వేగు చుక్క. భూస్వామ్య రాజకీయాలు , పెత్తందారులు రాజ్యమేలుతోన్న తరుణంలో పేద ప్రజల కోసం తానున్నానంటూ సింహపురి గడ్డపై ఉదయించారు.జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం మండలం, దామరమడుగు గ్రామంలో 1930 నవంబర్ 3న జక్కా రమణయ్య, జక్కా శంకరమ్మ దంపతులకు జన్మించారు. బుచ్చిరెడ్డిపాళెంలోని హైస్కూల్‌లో ఎస్-ఎస్ఎల్‌సి చదివారు.ఆయన విద్యాభ్యాసం తరువాత 1951 వరకు గ్రామంలో వ్యవసాయం చేశారు. 1948 నుంచి1951 వరకు ఆనాటి కమ్యూనిస్టుపార్టీ నిషేదంలో ఉన్నందున రహస్య జీవితం గడిపే కమ్యూనిస్టు నాయకులకు దామరమడుగులో తలదాచుకునేవారు. గ్రామంలో జక్కా వెంకయ్య వారికి రక్షణగా ఉండేవారు. 1948లో మద్రాసు ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీని నిషేధించింది. దామరమడుగు గ్రామంలో జక్కా వెంకయ్యను అరెస్టు చేసి కోవూరు కోర్టులో 15రోజులు రిమాండ్‌లో ఉంచారు. 1951లోభూమికోసం, భుక్తి కోసం తెలంగాణలో జరిగిన సాయుధ పోరాటల స్ఫూర్తితో డాక్టర్ జెట్టిశేషారెడ్డి ప్రోత్సాహంతో పార్టీ సభ్యులుగా చేరారు. అప్పుడే 1951 లోనే దామర మడుగు గ్రామంలో కమ్యూనిస్టు పార్టీ శాఖను ఏర్పాటు చేశారు.1953లో వ్యవసాయ కూలీలకు ఆరు సవా సేర్లు కూలి కావాలని స్వగ్రామం నుంచి జక్కా పోరాటానికి నాయకత్వం వహించారు. 1956లో కమ్యూనిస్టు పార్టీ జిల్లా కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. 1955లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో పార్టీ విజయం కోసం జక్కా విస్తృతంగా తిరిగారు. 1957లో దామరమడుగు గ్రామ సర్పంచిగా ఎన్నికయ్యారు. 1957నుంచి 1964వరకూ దామర మడుగు సర్పంచిగా గ్రామాభివృద్ధికి ఎనలేని కృషిచేశారు. 1963నుంచి దేశంలోని ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో వచ్చిన భిన్నాభిప్రాయాలను దృష్టిలో పెట్టుకొని సిపిఎం నిర్మాణానికి కృషిచేశారు. 1965లో ఉద్యమంలో భాగంగా రాజమండ్రి సెంట్రల్ జైల్లో సంవత్సరం ఐదు నెలలు జైలు జీవితం గడిపారు. 1968లో కమ్యూనిస్టు ఉద్యమంలో తిరిగి భిన్నాభిప్రాయాలు వచ్చినప్పుడు జిల్లాలో సిపిఎంను నిలబెట్టేందుకు ఎనలేని కృషిచేశారు. 1969లో సిపిఎం జిల్లా కమిటీ, రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు. 1952 నుంచి 1956వరకూ యువజన సంఘం జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 1958 నుంచి వ్యవసాయ కార్మిక ఉద్యమంలో కీలకపాత్ర వహించారు. 1972లోనే అల్లూరు నియోజకవర్గం శాసనసభ్యునిగా పోటీ చేసి కేవలం 504ఓట్ల తేడాతో ఓడిపోయారు. 1958 నుంచి 1972వరకూ జిల్లాలోని చెరువులోతట్టు బంజరు సాగు దార్ల పోరాటానికి నాయకత్వం వహించారు. జిల్లాలో సుమారు 10వేల ఎకరాలు రైతులకు దక్కేలా చూశారు. 1974లో బంజరు భూముల ఆక్రమణ, వ్యవసాయ కూలీల కూలిరేట్ల కోసం జరిగిన పోరాటానికి జక్కా నాయకత్వం వహించారు. 1974లో మేలో జరిగిన చారిత్రాత్మక రైల్వే సమ్మెను జయప్రదం చేసేందుకు రహస్య జీవితం గడుపుతూ కృషిచేశారు. 1975లో ఎమర్జెన్సీలో సంవత్సరం ఐదునెలలు నెల్లూరు జైలులో ఉన్నారు. మధ్యలో ఒక నెల ముషీరాబాద్ జైల్‌కు తరలించారు. జక్కా జైల్లో ఉన్న సమయంలో రాజకీయ క్లాసులు బోధించారు. సత్యనారాయణరెడ్డి, గౌత్ లచ్చన్న కూడా ఈయన క్లాసులు వినేవారంటే జక్కా వెంకయ్య తెలివితేటలు ఏపాటివో అర్థం చేసుకోవచ్చు. 1978లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కోవూరు నియోజవకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 1978 జిల్లాలో బంజరు భూముల ఆక్రమణ ఉద్యమాన్ని నిర్వహిం చారు. 1979 మార్చిలో రికార్డుల్లో లేకుండా చేసిన అదనపు భూములను బయటకు వెలికితీ యాలనే పోరాటంలో యల్లాయ పాళెంలో పోలీసు కాల్పులు జరిగాయి. అందులో గాలంకి తిరుపాలు మృతిచెందారు. 1979మేలో తుపాన్ సందర్భంగా జిల్లాలో అఖిలపక్ష రైతు ఉద్యమంలో కీలక పాత్ర వహించారు. పోరాట ఫలితంగా రైతులకు కొన్ని రాయితీలను ప్రభుత్వం అందించింది. ఉద్యమ సందర్భంగా కావలిలో జరిగిన కాల్పుల్లో గౌరవరం రైతు చింతా శేషారెడ్డి మృతిచెందారు. వారి కుటుంబాన్ని ఆదుకునేందుకు పార్టీ తరపున ఆర్థిక సాయం అందించారు. 1983 ఎన్నికల్లో కోవూరు అసెంబ్లీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 1984లో జరిగిన ప్రజాస్వామ్య పునరుద్ధరణ పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. 1985లో అల్లూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎంఎల్ఎగా గెలుపొందారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషిచేశారు. రైతుల సమస్యలపై ప్రధాన దృష్టిపెట్టారు. 1989లో అల్లూరు నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అల్లూరు నుంచి పోటీ చేసి తిరిగి మళ్లీ ఎన్నికయ్యారు. 1996లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యునిగా ఎన్నికయ్యారు. 2002లో ఆక్వా రైతుల సమస్యలపై జరిగిన దీర్ఘకాలిక పోరాటానికి జక్కా నాయకత్వం వహించారు. 2002లో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యునిగా 1948లో కమ్యూనిస్టు ఉద్యమంలో చేరారు. 2004లో ఆయనకు గుండెపోటు రావడంతో నెల్లూరు రామచంద్రారెడ్డి, చెన్నయ్‌లోని విజయ ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. గుండె 30శాతం పనిచేసినా 14 సంవత్సరాలు జీవించారు. 2018 మే 29న ఆనారోగ్యంతో మృతి చెందారు. నేడు ఆ మహనీయుని 93వ జయంతి. ఆపార్టీ నేతలు, కార్యకర్తలు,ప్రజలు ఘనంగా నిర్వహించనున్నారు.

రైతు కూలీల సమస్యల పరిష్కారంలో
రమణయ్య కృషి మరువలేనిది : సిపిఎం

తోటపల్లిగూడూరు :రైతు కూలీల సమస్యల పరి ష్కారం కోసం కాల్తీ రెడ్డి రమణ య్య ఎనలేని కషి చేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని మల్లి కార్జునపురం గ్రామానికి చెందిన సిపిఎం నాయకులు కాల్తిరెడ్డి రమణయ్య 24వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. సిపిఎం మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్ర మంలో ముఖ్య అతిథిగా రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పేదల సమ స్యల పరిష్కారం కోసం కాల్తిరె డ్డి రమణ య్య అలుపెరుగని పోరాటాలు చేశారని కొని యా డారు. సిపిఎం సీనియ ర్ నాయకులు జక్కా వెంక య్యతో రమణయ్యకు అత్యం త సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యు లు ఎం. మోహన్ రావు, నెల్లూరు యాదగిరి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆలూరు తిరిపాలు, జిల్లా కమి టీ సభ్యులు టి. దయాకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నక్కా రాధాయ్య, వే గూ రు వెంకయ్య, పచ్చా మధు తదితరులు రమ ణయ్య సేవలను కొనియాడారు. రావు సిపిఎం జెం డాను ఆవి ష్కరించారు. అనంతరం రమ ణ య్య చిత్రపటానికి పూలమా లవేసి నివాళి అర్పించారు. శాఖా కా ర్య దర్శి కాల్తీరెడ్డి రమణమ్మ, నాయకులు కె చిన్నా, బండి శౌరి, డివైఎఫ్ఐ నాయ కులు పచ్చ రాజేష్ ఉన్నారు.

కాల్తీరెడ్డి రమణయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ దుర్మరణం

ప్రజాశక్తి-గుడ్లూరు :రెండు లారీలు ఢీకొన్న ప్రమాదంలో లారీ డ్రైవర్ విశ్వనాథన్(36) దుర్మరణం చెందిన సంఘటన గుడ్లూరు మండలం, తెట్టు వ్యవసాయ మార్కెట్ చెక్ పోస్టు దగ్గర గురువారం జరిగింది. విజయవాడ నుంచి చెన్నై వెళు తున్న లారీ తెట్టు వ్యవసాయ మార్కెట్ కార్యాలయం దగ్గరికి వచ్చేసరికి ముందు వెళుతున్న లారీ సడన్‌గా ఆగిపోవడంతో వెనుక వచ్చే లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. చెన్నైకి చెందిన విశ్వనాథ్ అనే లారీ డ్రైవర్ కి తీవ్ర గాయాలు కావడంతో కావలి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స జరిగే లోపే మతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆలయ నిర్మాణానికి శ్రీకారం

ప్రజాశక్తి -కలువాయి :ండలంలోని వెంకట రెడ్డి పల్లి గ్రామం లో గ్రామ దేవత అంకాలమ్మ గుడి నిర్మాణానికి గ్రామస్తులు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పలు పూజలు నిర్వహించారు.భక్తులు విరివిగా పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

ఉలవపాడు :మండలంలోని కరేడు పివిఎస్ ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ -19 బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగే స్కూల్ గేమ్స్ -అండర్ 19 బాలికల రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు పాఠశాలలో ని ఎనిమిది మంది ఎంపికయ్యారు.

క్రీడాకారుడికి అభినందనలు

ప్రజాశక్తి-కందుకూరు :ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ 19 బాస్కెట్‌బాల్ జట్టు, మదనపల్లిలో అక్టోబర్ 28 నుంచి అక్టోబర్ 30 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలలో పాల్గొన్నారు. ప్రకాశం జిల్లా జట్టులో కందుకూరు టిఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో అత్యంత ప్రతిభ కనపరిచిన చదలవాడ హేమంత్ అండర్ -19 ఆంధ్రప్రదేశ్ ఎస్‌జి యఫ్ రాష్ట్ర జట్టుకి ఎంపికయ్యారు. పంజాబ్ రాష్ట్రంలో డిసెంబర్లో జరగబోవు 67వ రాష్ట్రస్థాయి బాస్కెట్బాల్ పోటీలలో పాల్గొన నున్నారు. ఈ సందర్భంగా హేమంత్‌ను అభినందించారు.

ఐఎఫ్‌సి సేవా కార్యక్రమాలు

కందుకూరు : ఐ.ఎఫ్.సి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఆ సంస్థ సెక్రటరి షంషేర్ మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేదిశగా సేవలందిస్తున్నారు. సంస్థ అధ్యక్షుడు సాజిద్, ట్రజరర్ హాఫీజ్,టౌన్ ఇంచార్జ్ అయూబ్ ఖాన్ పఠాన్, షమ్ షుద్దీన్ పాల్గొన్నారు.

గౌతమ్ ప్రజల గుండెల్లో నిలిచిపోతారు..

జిల్లా అభివృద్ధిలో తనదైన ముద్రవేశారు.. - విగ్రహావిష్కరణలో మంత్రి 'కాకాణి'

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

మాజీ మంత్రి గౌతమ్‌రెడ్డి ప్రజల గుండెల్లో చిర స్థాయిగా నిలిచిపోతారని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని డైకాస్‌రోడ్డు సెంటర్‌లో ఆయన విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో ఆయన చేసేన సేవలు మరువలేమన్నారు. సౌమ్యుడిగా, ప్రజలకు సేవచేశారన్నారు. ఆత్మకూరులో అనేక కార్యక్రమాలు జరగడానికి ఆయన చేసిన కృషి గొప్పదన్నారు. అన్న ఆశయ సాదన కోసం విక్రమ్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. .రాజకీయాల్లో ఉండి గౌతమ్ వేలెత్తి చూపకుండా చివరి శ్వాస వరకు రాజులా బతికారని అన్నారు. మేకపాటి గౌతమ్ లాగే మేకపాటి విక్రమ్ కూడా విభిన్న శైలి, మనస్తత్వం, పని తీరు అన్న లాగే నిశ్శబ్ధంగా అనుకున్నవి చేస్తూ ముందుకెళుతున్నారన్నారు. గౌతమ్ లా..ప్రచారం తక్కువ పని ఎక్కువగా ఉండడం రాజకీయాల్లో అరుదైన విషమని కాకాణి స్పష్టం చేశారు. ఆత్మకూరు ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ అనుకున్న నెల లోపే మేకపాటి గౌతమ్ అన్న విగ్రహ ఆవిష్కరణ శరవేగంగా పూర్తవడంలో కషి చేసిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఆత్మకూరు ఎంఎస్ఎంఈ పార్కులో త్వరలో 10 పరిశ్రమలు ఏర్పాటు చేసేలా సీఎం జగన్ మోహన్ రెడ్డి హామీ ఇచ్చినట్లు సభా సాక్షిగా ప్రకటించారు. సభలో సీనియర్ నేత, మాజీ ఎంపి మేకపాటి రాజ మెహన్‌రెడ్డి, ఎంఎల్‌సి పి.చంద్రశేఖర్‌రెడ్డి, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, మేరిగ మురళిధర్ జెడ్‌పి ఛైర్మన్ ఆనం అరుణమ్మ, మేయర్ స్రవంతి, ఎంఎల్ఎ ఎం . మహీధర్‌రెడ్డి, నగర ఎంఎల్ఎ అనిల్‌కుమార్ యాదవ్, గూడూరు ఎంఎల్ఎ వరప్రసాద్, సూళ్లూరు పేట ఎంఎల్ఎ సంజీవయ్య , కావలి నియోజకవర్గ ప్రతాప్ కుమార్ రెడ్డి, ఉదయగిరి వైసిపి ఇన్‌ఛార్జ్ మేకపాటి రాజారెడ్డి , డిప్యూటీ మేయర్ రూప్ కుమార్‌యాదవ్ ఉన్నారు.

గౌతమ్ విగ్రహం ఆవిష్కరిస్తున్న మంత్రి

కాకాణి, అనిల్ ఎడముఖం పెడముఖం..!

మేకపాటి గౌతమ్‌రెడ్డి విగ్రహా విష్కరణ కార్యక్రమంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నగర ఎంఎల్ఎ అనిల్‌కు మార్ యాదవ్ ఎడముఖం..పెడముఖంగా కని పించారు. కనీసం వేదికపై ఉన్న నేతలు అందరి పేర్లు ప్రస్తావించిన వారు,. ఇద్దరు ఎవరి పేర్లు ప్రస్తావించుకోకపోవడంతో ఇద్దరి మధ్య ఉన్న విభేదాలు మరోసారి బయటపడ్డాయి. అనిల్, రూప్‌కుమార్ సభలో పాల్గొన్నారు ఎవరికి వారే అన్నట్లు ఉన్నారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-కందుకూరు

మండలంలోని మాచవరం రోడ్డులోని బిఆర్ పెట్రోల్ బంకు ఎదురుగా ఇటీవల జరిగిన డి వెంకటేశ్వర్లు (38)హత్య కేసును పోలీసులు ఛేదించారు.ఇటీవల కందుకూరు పట్టణం కేసరిగుంట కాలనీకి చెందిన వెంకటేశ్వర్లును గుర్తు తెలియని వ్యక్తులు రాయితో కొట్టి చంపిన విషయం తెలిసిందే. హత్యకు వివాహేతర సంబంధమే కారణమై ఉంటుందని అనుమానాలు ఆనాడే వ్యక్తమయ్యాయి. అదే నిజమని పోలీసు విచారణలో తేలింది. గురువారం కందుకూరు డిఎస్‌పి రామచంద్ర విలేకరుల సమావేశంలో హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించాడు. ఉలవపాడు మండలం ధర్మారెడ్డి సంఘానికి చెందిన యానాది కులానికి చెందిన బాపట్ల సుబ్బారావు అనే వ్యక్తి వెంకటేశ్వర్లును గత నెల 28వ తేదీన రాత్రి హత్య చేసినట్లు విచారణలో తేలిందన్నారు. బాపట్ల సుబ్బారావు అనే వ్యక్తి గతంలో కందుకూరు కేసరగుంట కాలనీలో వెంకటేశ్వర్లు ఇంటి పక్కనే నివాసమున్నారు. కందుకూరులో వెంకటేశ్వర్లు, సుబ్బారావు పక్కపక్కనే నివాసముంటున్న సందర్భంలో సుబ్బారావు భార్యతో వెంకటేశ్వర్లు వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో గొడవలు జరిగాయి. ఈ గొడవలు జరుగుతున్న నేపథ్యంలో సుబ్బారావు అక్కడ ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయాడు. తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని వెంకటేశ్వర్లుపై సుబ్బారావు కక్ష పెంచుకున్నాడు. అది మనసులో పెట్టుకొని సుబ్బారావు వెంకటేశ్వర్లును చంపాలని నిర్ణయించుకున్నాడు. ఇద్దరి మధ్య గొడవలు ఉన్నప్పటికీ సుబ్బారావు, వెంకటేశ్వర్లు అప్పుడప్పుడు కలిసి మద్యం తాగుతూ ఉంటున్నారు. ఈ నేపథ్యంలో గత నెల 28వ తేదీన రాత్రి సుబ్బారావు వెంకటేశ్వర్లుకు మాయమాటలు చెప్పి పామూరు బస్టాండ్‌లో మద్యం కొనుగోలు చేసి వెంకటేశ్వర్లు బైక్‌పై మాచవరం రోడ్డులోని బిఆర్ పెట్రోల్ బంకు ఎదురుగా సెల్ టవర్ దగ్గరలో ఉన్న పాత వైన్ షాపు వద్దకు వెళ్లారు. అక్కడ గతంలో జరిగిన విహేతర సంబంధాల విషయమై మాటమాట పెరిగి ఘర్షణ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో సుబ్బారావు పక్కనే ఉన్న సిమెంటు దిమ్మెతో వెంకటేశ్వర్లు తలపై బలంగా కొట్టాడు. దీంతో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మతి చెందాడు. హత్య చేసింది సుబ్బారావు అయినప్పటికీ మరో కొంతమందిపై అనుమానంతో తాము విచారణ నిర్వహించామని, ఆ విచారణలో వారు కాదని తేలిందని డిఎస్‌పి తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించామని తెలిపారు. కందుకూరు పట్టణంలో ఉన్న సీసీకేమారాల ఆధారంగా హత్య చేసింది సుబ్బారావు అనే అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారించగా వివాహేతర సంబంధం నేపథ్యంలో తానే చంపినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. కేసును ఛేదించడంలో గుడ్లూరు సిఐ పి సుబ్బారావు, కందుకూరు సిఐఎస్కే నఫీజ్ భాష లను డిఎస్పి రామచంద్ర అభినందించారు.

వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి రామచంద్ర

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-నెల్లూరు :రూరల్ నియోజకవర్గం, సౌత్ మోపూరు గ్రామానికి చెందిన గుంజి రవి వారి మిత్రబందం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. గురువారం రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నగరంలోని తన కార్యాలయంలో గుంజి రవి, మిత్రబృందానికి టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో తాను వైసిపి పార్టీ నుంచి ఎంఎల్ఎగా ఎన్నికల భరిలో నిలిచిన సమయంలో తన గెలుపుకోసం చురుకుగా పనిచేసిన వ్యక్తి గుంజి రవి అన్నారు.

వైసిపిలో చేరికలు

నగరంలోని 45వ డివిజన్‌కు చెందిన కొనుగోలు క్రాంతికుమార్, వారి మిత్రబందం నగరంలోని రాజన్న భవన్‌లో నగర శాసనసభ్యులు పి.అనీల్‌కుమార్ సమక్షంలో వైసిపిలో గురువారం చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కొనుగోలు క్రాంతికుమార్, సురేంద్ర, కష్ణ, నరేంద్ర, ప్రసాద్, శ్రీరాం, ఆరిఫ్, నాని, జితేంద్ర, హరి, తదితరులు వున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండి.ఖలీల్‌అహ్మద్, 45వ డివిజన్ ఇన్‌ఛార్జి నేతాజీ సుబ్బారెడ్డి, వైఎస్ఆర్‌సిపి నాయకులు తాళ్ళూరు రాము, ఉడతా రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా రక్షణ భేరి' సభను జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి-కందుకూకు :కందుకూరు సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రజా రక్షణ బేరి గోడపత్రికను సిపిఎం నాయకులు ఎస్ఎ గౌస్, డి రామ్మూర్తి , ఎస్.కె మున్వర్ సుల్తానా, ఎస్.కె మల్లిక, ఎం పద్మ ,డి ఎం రాయుడు ఆవిష్కరిం చారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్ఎ గౌస్ మాట్లాడుతూ సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో లౌకికవాదం ప్రజాస్వామ్య పరిరక్షణ, అస మానతలు లేని అభివద్ధి కోసం బస్సు యాత్ర జరుగుతుందని చెప్పారు. ఈ బస్సు యాత్ర కందుకూరు పట్టణానికి నవంబర్ 6 తేదీ సాయంత్రం 5 గంటలకు కందుకూరు అంబేద్కర్ బొమ్మ వద్దకు వస్తుందన్నారు. అంబేద్కర్ బొమ్మ వద్దబహిరంగ సభ ఉంటుందన్నారు.

డివైఎఫ్ఐ జెండా ఆవిష్కరణ

నెల్లూరు :డివైఎఫ్ఐ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని 16వ డివిజన్ ప్రాంతంలో డివైఎఫ్ఐ జెండా ఆవిష్కరణ జరిగింది. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జెండాను నగర ఉపాధ్యక్షులు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ నగర కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ నగరంలో గతంలో రౌడీయిజం, స్కిల్ గేమ్స్ మతోన్మాదానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు నడిపి విజయం సాధించిన చరిత్ర డివైఎఫ్ఐకి ఉందన్నారు. కేంద్రంలో 10 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్న రాష్ట్రంలో లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్న , వాటి భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయకుండా రెండు ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఇలాంటి సమయంలో యువతి యువకులందరూ ఐక్యంగా ఉండి పోరాడి చదువుకు తగ్గ ఉద్యోగం యువత సామర్థ్యానికి తగ్గ ఉపాధి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక డివైఎఫ్ఐ నాయకులు ఫయాజ్ ,బాలసుబ్రమణ్యం, వెంకటేష్, నాని ,సతీష్ ఉన్నారు.

జెండా ఆవిష్కరిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ఇంటింటా 'ఇంటూరి' ప్రచారం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణంలోని 17వ వార్డు బంగారమ్మ గుడి ప్రాంతంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టో లోని అంశాలను స్థానికులకు వివరించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శ్రీను, వార్డు అధ్యక్షుడు దివి శ్రీనివాసులు, నాయకులు ముట్టే రామారావు, రావి వెంకటేశ్వర్లు, అత్తంటి మాధవ, అత్తంటి మాల్యాద్రి, దివి వెంకటేశ్వర్లు, నల్లూరి సింగయ్య, అమర రామలింగయ్య, జంపాల శ్రీకాంత్, కాకుమాని శ్రీనివాసులు, కాకుమాని ఆంజనేయులు ఉన్నారు.

'జగనన్న సురక్ష'తో మెరుగైన వైద్యసేవలు

ప్రజాశకి-కందుకూరు :జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం స్థానిక కోటు వారి స్ట్రీట్ పరిధిలో క్యాంపును మున్సిపాలిటీ ఆఫీస్‌లో గురువారం ఏర్పాటు చేశారు. ఆ సందర్భంగా జరిగిన సభలో జెసిఎస్ కో ఆర్డినేటర్ ముప్ప వరపు కిషోర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మహోత్తరమైం దన్నారు. బాధిత ప్రజల ముంగిటకు వైద్యం అందు బాటులోకి వచ్చిందన్నారు. మున్సిపల్ మేనేజర్ చంద్రమోహన్ మాట్లాడారు.మున్సి పల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ డియా రమేష్ హెల్త్ ఆఫీసర్ బషీర్ సచి వాలయం అడ్మిన్ సెక్రటరీ పావని సచివాలయం కన్వీనర్లు గహ సారథులు ఉన్నారు.

కావలి : కావలి పట్టణం మద్దూరు పాడు 1వార్డులో గురువారం జరిగిన "జగనన్న ఆరోగ్య సురక్ష" వైద్య శిబిరంలో కావలి శాసన సభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి సతీమణి శ్రీమతి రామిరెడ్డిఆదిలక్ష్మి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె శిబిరానికి వచ్చిన ప్రజలను, వృద్ధులను, బాలింతలను పలకరించి వారికి అందుతున్న వైద్య సేవలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు :ఎపి ప్రభుత్వ డాక్టర్స్ అసోషియేషన్ నూతన కార్యవర్గ ఎంపిక ఏకగ్రీవం అయింది. గురువారం జిజిహెచ్‌లో నిర్వహించిన ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేన్ ఎన్నికలఅధికారిగా డాక్టరు గోవింద్ వ్యవహరించారు. ఈ అసోసియేషన్ అధ్యక్షుడుగా డాక్టర్ ఎం.నరేంద్ర, జనరల్ సెక్రటరీగా డాక్టర్ మహేష్, కోశాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్‌లుగా ప్రకటించారు. నూతనంగా ఏర్పడిన కార్యవర్గంమాట్లాడారు. నూతన కార్యవర్గాన్ని ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు వసుంధర, సర్వజన ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టరు సిద్ధానాయక్ అభినందించారు.

కబడ్డీ పోటీల్లో రాణించిన 'అఖిల'

ప్రజాశక్తి-కావలి: ఆటలు ఆత్మ స్థైర్యాన్ని పెంచుతాయని డి.బి.ఎస్ కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు పేర్కొన్నారు. బుధవారం తిరుపతి పట్టణంలోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్మించిన యూనివర్సిటీ స్థాయి కబడ్డీ పోటీలలో డి. బి. ఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో తతీయ సంవత్సరం చదువుతున్న నెల్లూరు జిల్లా ,మైపాడు గ్రామానికి చెందిన జి. అఖిల అనే విద్యార్థిని తన ఆట తీరును ప్రదర్శించి,యూనివర్సిటీ స్థాయి క్రీడల్లో డి.బి.ఎస్. కీర్తి పథకం ఎగరవేయటం గర్వించదగిన విషయమన్నారు. ఈ సందర్భంగా ఆమెను ప్రత్యేకంగా అభినందిస్తూ ఆమెను జాతీయ స్థాయి క్రీడల్లో రాణించే విధంగా తీర్చిదిద్దామని ఉద్భోధించారు. క్రీడలు మానసిక ఉల్లాసం కోసం ఆత్మస్థైర్యాన్ని పెంచుతాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. టి.వి. రావు మాట్లాడుతూ అన్ని రంగాలలో విద్యార్థినులు ముందంజలో ఉన్నారన్నారు. ఆటల్లోనూ అద్భుతంగా రాణిస్తున్న తమ కళాశాల విద్యార్థిని జి.అఖిలను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఎఒ జి. రమేష్ బాబు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ దాసరి. శివసాగర్ కుమార్, డిప్లమా ఫిజికల్ డైరెక్టర్ బి. రాంబాబు అన్ని విభాగ అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి: మండలంలో తాగునీటి సమస్యలు మౌలిక వసతులపై సంబంధిత అధికారులు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కషి చేయాలని ఎంపీపీ మూలే పద్మజా వినయ్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ ఈశ్వరమ్మ అధ్యక్షతన ప్రారంభించారు. జెడ్పిటిసి మోడీ రామాంజనేయులు 17 పంచాయతీల్లో నెలకొన్న నీటి సమస్యలు విద్యుత్ సమస్యలు తక్షణం పరిష్కరించాలన్నారు. జగనన్న సొంతింటి కలను గ్రామాలలో సొంత స్థలం గల వారికి జగనన్న ఇళ్లు కల్పించి వారి కలలు నెరవేర్చాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా కేంద్రాలలో ఎరువులు పురుగుమందులు అందుబాటులో ఉంచి అవసరాలకు రైతులకు అందించాలన్నారు. ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా అధికారులు సచివాలయ సిబ్బంది కషిచేయాలన్నారు. అనంతరం వెంగళరావు నగర్ సర్పంచ్ ఎం తిరుపతి, గన్నేపల్లి పంచాయతీ సర్పంచ్ వెంకటస్వామి నాయుడు ప్రస్తుత నెలలోనే నీటి సమస్యలు తాండవిస్తున్నాయన్నారు. నూతన బోరులు ఏర్పాటు మోటార్ మరమ్మతులకు నగదు మంజూరు చేయాలని కోరారు. వ్యవసాయ శాఖ ఉపాధి హామీ రెవెన్యూ సమస్యలపై సంబంధిత అధికారులు చర్చించి సమస్యలకు పరిష్కారం వివరించారు. ఆర్‌డబ్ల్యు డిఇ నీటి సమస్య ఉన్న గ్రామాలలో ట్యాక్టర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు జిల్లా ఉన్నతాధికారుల నుండి సమాచారం వచ్చిందని, నేటి సమస్య ఉన్న సర్పంచులు తెలిపితే నీటిని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు గుండుపల్లి మాలకొండయ్య చౌదరి మండల కన్వీనర్ ఓబుల్ రెడ్డి మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్య, ఎస్టాని ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతయ్య, సర్పంచులు పాములూరి సామ్రాజ్యం, సత్తెనపల్లి వరలక్ష్మి, గొల్లపల్లి కల్పన కల్లూరి వెంకటేశ్వర రెడ్డి, సుభాని, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పద్మజ

పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-ఉదయగిరి : షబ్బీర్ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మధ్యాహ్నం భోజనం రుచికరంగా లేదని మండల విద్యాశాఖ అధికారి-2 తోట శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల షబ్బీర్ కాలనీ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అన్ని తరగతుల విద్యార్థుల అభ్యసన పఠన సామర్థ్య నైపుణ్యాలను పరిశీలించారు. రెండవ తరగతి విద్యార్థి షేక్ నజీమ్ బాషా ఆంగ్ల పదాల స్పెల్లింగ్లు అర్థాలు గణితంలో 20 ఎక్కాల లో సరైన సమాధానం చెప్పడంతో ఆ విద్యార్థిని విద్యాశాఖ అధికారి అభినందించారు. తరగతి గది లోని బోధనోపకరణ సామాగ్రిని చూసి ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం మధ్యాహ్నం భోజనము చేసే విద్యార్థులను భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడగడంతో విద్యార్థులు సరిగా లేదని అసంతప్తి వ్యక్తం చేయడంతో స్పందించిన మండల విద్యాశాఖ అధికారి స్వయంగా భోజనమును రుచి చూచి నాణ్యతగా రుచిగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత పిల్లలకు అయితే ఈ విధంగా చేసి పెడతారా అని భోజన నిర్వాహకులను హెచ్చరించి ప్రతిరోజు రుచిగా నాణ్యతగా భోజనం తయారు చేయాలని హెచ్చరించి ఈ సారి పాఠశాల తనిఖీకి వచ్చినప్పుడు భోజనం రుచిగా నాణ్యతగా లేకపోతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కుట్టుమిషన్లు వితరణ

ప్రజాశక్తి-కావలి: ప్రవాస భారతీయుల సహకారంతో కావలి పట్టణంలోని "శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్ "ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రంకు గురువారం మూడు కుట్టు మిషన్లు దాతలు అందించారు . శిక్షణ కార్యక్రమాలకు అండగా తమ వంతుగా అమెరికాలో ఉంటున్న కేతు శశికాంత్, శ్రీమతి కేతులత శిక్షణాకేంద్రానికి అవసరమైన మూడు కుట్టు మిషన్లు పంపించారు. గత కొన్ని సంవత్సరాలుగా కావలిలో మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా వారికి వత్తి పరంగా నైపుణ్యం కల్పించే ప్రయత్నం చేస్తున్న శ్రీ సాయి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పొన్నగంటి మాధవికి తమ వంతు సహకారం ఇచ్చే క్రమంలో ఈ మిషన్ లను పంపిణీ చేశారు.

కుట్టుమిషన్లు అందజేస్తున్న దృశ్యం

పక్కా గృహ నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి-వరికుంటపాడు: మండలంలోని ఎస్టీ కాలనీలో పక్కా గహ నిర్మాణాలను తూర్పు చన్నంపల్లిలో జగనన్న లేఅవుట్లను గహ నిర్మాణ శాఖ ఇఇ రంగ ప్రసాద్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని జగనన్న పక్కా గహాలు మంజూరైన లబ్ధిదారులు త్వరతగతిన నిర్మాణ పనులు చేపట్టాలి. ప్రభుత్వం ప్రతి పేదవానికీ గూడు కల్పించాలని ఉద్దేశంతో లేఅవుట్లు ఏర్పాటుచేసి పక్కా గహాలను నిర్మించి ఇస్తుందన్నారు. జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారులకు మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు ఆయన వెంట ఇంజినీరింగ్ సహాయకులు సుధీర్ తదితరులున్నారు.

అవినీతి వ్యతిరేక చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-కావలి: సమాజంలో పెరిగిపోతున్న అవినీతిని నిర్మూలించడానికి అవసరమైన అవినీతి వ్యతిరేక చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని లోక్ సత్తా నాయకులు ఎం.మాల కొండారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పాతూరు మునిసిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు అవినీతి వ్యతిరేక చట్టాలపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. మనదేశ ఆర్థిక, సామజిక, రాజకీయ పురోగతికి అవినీతి పెద్ద ఆటంకమన్నారు. మహాత్మా గాంధీ కలలుగన్న అవినీతి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పాఠశాల ప్రధానో పాధ్యాయులు వి.వి. సుబ్బారావు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో మాట్లాడారు. " ప్రతి ఒక్కరూ నేను లంచం పుచ్చుకోను! ఇవ్వను!అని అన్ని పనులను నిజాయతీతో పారదర్శకంగా నిర్వహిస్తానని ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దయాలత, మనోహర్, షేక్. మస్తాన్‌వలి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సమాధుల పండుగ.

ప్రజాశక్తి-బిట్రగుంట: సమాధుల పండుగ సందర్భంగా బోగోలు పంచాయతీ లోని క్రిస్టియన్స్ సోదరుల సమాధుల తోటలో గురువారం క్రిస్టియన్ సమాధులను పూలతో ఘనంగా అలంకరించారు. బిట్రగుంట లోని సమాధి తోటలో ఇంగ్లాండ్ ,అమెరికా, ఆస్ట్రేలియా విదేశాల వారి సమాధులు ఉండడంతో విదేశాల నుంచి ఇతర రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో సమాధుల పండుగను నిర్వహించు కుంటారు. క్రిస్టియన్స్ సోదరుల బంధువుల తోబొట్టువుల సమాధులను పూలతో అలంకరించి పాస్టర్లచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో మండలంలోని పాస్టర్లు, క్రిస్టియన్ సోదరులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బుకింగ్ కార్యాలయంలో తనిఖీ

ప్రజాశక్తి-బిట్రగుంట: విజయవాడ డివిజన్ పరిధిలోని బిట్రగుంట రైల్వే క్రూ బుకింగ్ కార్యాలయాన్ని రైల్వే చీఫ్ ఎలక్ట్రికల్ లోకో మోటివ్ ఇంజినీర్ తౌర్య గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. రైల్వే గార్డులు, డ్రైవర్లు విధినిర్వహణ పట్ల అశ్రద్ధ చేయకుండా సిబ్బంది పని చేయాలని సూచించారు. రైల్వే విధులలో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగ కల్పనే గౌతంరెడ్డి ధ్యేయం

జాబ్ మేళాకు అపూర్వ స్పందన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్
మెట్ట నియోజకవర్గమైన ఆత్మకూరు లాంటి ప్రాంతంలో ఉన్న నిరుద్యోగ యువతకు భారీ స్థాయిలో ఉద్యోగాలు కల్పించడం కీర్తిశేషులు మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి కల అని, ఆదిశగా జాబ్ మేళాలు, పలు కంపెనీలతో మాట్లాడి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి పేర్కొన్నారు.గురువారం మేకపాటి గౌతమ్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని ఆంధ్రా ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంగా 29 కంపెనీల సహకారంతో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. తొలుత మంత్రి గౌతమ్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతంలో ఉన్న నిరుద్యోగుల వివరాలు పూర్తిగా తమ వద్ద నున్నాయని, యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా త్వరలోనే వెబ్ సైట్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. అనేక కంపెనీల సహకారంతో నియోజకవర్గ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ప్రతి సంవత్సరం గౌతమన్న జయంతి సంద్రభంగా జాబ్ మేళా నిర్వహిస్తామని, ఇప్పటి వరకు నియోజకవర్గ స్థాయిలో రెండు జాబ్ మేళాలు నిర్వహించి ఉపాధి అవకాశాలు కల్పించగలిగామన్నారు. ప్రస్తుతం 3వ దఫా భారీ స్థాయిలో ఉద్యోగ అవకాశాల కల్పించేందుకు నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాకు అధిక సంఖ్యలో యువత పాల్గొనడం శుభపరిణామమని అన్నారు. ముఖ్యంగా యువత దూర, భారం అనేవి వదిలేసి కషి చేస్తేనే విజయం సాధ్యమవుతుందని, అవకాశాలు రావడం అంత సులభం కాదన్నారు. ఇలాంటి జాబ్ మేళాల ద్వారా ప్రఖ్యాత కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామంటూ ముందుకు వస్తున్నారని, దీనిని మీరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ జాబ్ నిర్వహణ కోసం రెండు నెలలుగా క్షేత్రస్థాయిలో ఆయా కంపెనీలతో మాట్లాడి ఏర్పాటు చేయడం జరిగిందని, ఫార్మా, ఫుడ్ ప్రాసెసింగ్, ఐటీ, నైపుణ్యాభివద్ధి రంగాలకు చెందిన సంస్థలు జాబ్ మేళాలో భాగస్వామ్యులు కావడం జరిగిందని వివరించారు. అనంతరం ఇంటర్వ్యూలు జరుగుతున్న ప్రాంతాల వద్దకు వెళ్లి నిరుద్యోగ యువతకు, కంపెనీ ప్రతినిధులతో ఎమ్మెల్యే స్వయంగా మాట్లాడారు. మెట్ట ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కంపెనీ ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ మధులత, బి.నాగేశ్వరరావు ఎంపీపీ కేత వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రావణ్ కుమార్, మర్రిపాడు మాజీ ఎంపీపీ శ్రీనివాసులు నాయుడు,

మాట్లాడుతున్న ఎంఎల్ఎ మేకపాటి

హమాలీల సమస్యలు పరిష్కరించాలని

తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-కోవూరు: ఇనమడుగు హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఇనమడుగు సెంటర్ నుంచి కోవూరు బజార్ సెంటర్ మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కోవూరు తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నెల్లూరు నగరకార్యదర్శి జి.నాగేశ్వరరావు, సిపిఎం కోవూరు మండల కార్యదర్శి గండవరపు శేషయ్యలు మాట్లాడుతూ ఇనమడుగు సెంటర్ హమాలీ కార్మికులు గత నెల రోజుల పై నుంచి సమ్మె చేస్తుంటే యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తున్నదన్నారు. మొండి వైఖరి విడనాడకపోతే పనులు స్తంభింప చేస్తామని హెచ్చరించారు. ఇనుమడుగు సెంటర్ పరిసరాలలోని దళితవాడల్లో నివసించే దళితుల శ్రమను దోచుకుంటున్నారన్నారు. తక్షణమే అధికారులు జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సిఐటియు నాయకులు పి.సూర్యనారాయణ,సి హెచ్ దామోదర్ రెడ్డి, రాంబాబు, సుధాకర్, ఆవాజ్ నాయకులు చాంద్ బాషా, ఇనమడుగు సెంటర్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు

ప్రాజెక్టులు శంకుస్థాపనకే అంకితం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట
వైసీపీ ప్రభుత్వంలో శంకుస్థాపనకే ప్రాజెక్టులు పరిమితమని కోవూరు తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి దుయ్యబట్టారు చేశారు. గురువారం మండలంలోని నరసాపురం గ్రామంలో ప్రతి అడుగు ప్రజల కోసమే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల్లో తిరుగుతూ ప్రజా సమస్యలపై మాట్లాడారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రసన్న ఆర్భాటంగా శిలాఫలకాలు వేయడం తప్ప పనులు పూర్తి చేసిన దాఖలాలు లేవన్నారు. కోవూరు నియోజకవర్గ ప్రజలను మభ్య పెట్టేందుకే సంఘం బ్యారేజీ వద్ద శిలాఫలకం వేశారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తారని నమ్మకం ప్రజలకు లేదన్నారు. గతంలో కూడా మలిదేవి డ్రెయిన్ ఆధునికీకరణ పనుల నిమిత్తం లక్ష 50వేల రూపాయలతో శిలాఫలకం వేసినా ఇప్పటికీ ఎటువంటి పనులు అక్కడ జరగలేదన్నారు. ముదివర్తి..ముదివర్తి పాలెం కాజ్వేను పూర్తి చేస్తే ఖాని ఎన్నికలకు పోటీ చేయనున్న ప్రసన్న మాట మార్చి ప్రజలలో అవహేన పాలయ్యారన్నారు. ఇప్పటికీ టిడిపి ప్రభుత్వంలో వేసిన రోడ్లు తప్ప వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే ప్రసన్న చేసిందేమీ లేదన్నారు.

లేఔట్లకు కమిషన్లకు ఆశపడి రోడ్లు వేశారు తప్ప ప్రజా ప్రయోజనాల నిమిత్తం ఎక్కడ రోడ్లు వేసిన దాఖలు లేవన్నారు. ఎమ్మెల్యే ప్రసన్న గతంలో కూడా శిలాఫలకాలు వేశారు తప్ప పనులు పూర్తి చేసిన దాఖలు లేవన్నారు. ప్రజలందరూ కూడా ఎమ్మెల్యే ప్రసన్న ను నమ్మే పరిస్థితి లేదన్నారు. సంఘం బ్యారేజ్ మంచినీటి ప్రాజెక్టును వైసీపీ ప్రభుత్వంలో పూర్తి చేయకపోయినా కూడా టిడిపి ప్రభుత్వం రావడంతోనే తామే పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు రావెళ్ల వీరేంద్ర చౌదరి, జిల్లా అధికార ప్రతినిధి చెముకుల కష్ణ చైతన్య, సీనియర్ టిడిపి నాయకులు బట్టేపాటి సురేష్ నాయుడు, బీసీ సెల్ నాయకులు గంపల అనిల్, లెనిన్ ఈదురు చెన్నయ్య, శివ, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కోవూరు తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి

సంగం బ్యారేజీ పరిశీలన

ప్రజాశక్తి-సంగం: బ్యారేజీ వద్ద బుచ్చి మంచి నీటి సరఫరాకు ఇంటెక్ వెల్, ఫిల్టరేషన్ ప్లాంట్ నిర్మాణానికి ప్రదేశాన్ని ఎంఎల్ఎ నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పరిశీలిం చారు.ఈ సందర్భంగా ఇంటెల్ వెల్ నిర్మాణం పై ఇరిగేషన్ అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహాయ సహకారాలతో అమత్ -2 నిధులు రూ.85 కోట్లతో ఎస్ ఎస్ ఆర్ మంచినీటి సరఫరా అభివద్ధి పథకానికి శంకుస్థాపన చేసామని తెలిపారు.10 వేల 650 కుళాయి కనెక్షన్లతో ప్రతీ ఇంటికి రక్షిత మంచినీటిని సరఫరా చేయబోతు న్నామన్నారు.త్వరలోనే బుచ్చిరెడ్డి పాలెం ప్రజల దాహార్తిని తీర్చబోతున్నామని పేర్కొన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు బుచ్చిరెడ్డిపాలెం అభివద్ధికి పూర్తి స్థాయిలో కషి చేస్తున్నామని అన్నారు.కార్యక్రమంలో సోమశిల ఎస్ఇ రమణా రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఎస్ఇ గోపాల్ రెడ్డి, ఇఇ అనీల్ కుమార్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

దుకాణాలకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-సంగం: స్థానిక శివాలయం సెంటర్లో టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేసేందుకు తహశీల్దార్ నాగరాజు స్థల పరిశీలన చేశారు. దుకాణాలు ఏర్పాటు చేసేందుకు స్థలం అణువుగా ఉందో లేదో అని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేసుకునేవారు తప్పని సరిగా లైసెన్స్ పొందాలని సూచించారు. కార్యక్రమంలో విఆర్‌ఓ రవిబాబు పాల్గొన్నారు.

8న మండల సమావేశం

ప్రజాశక్తి-వరికుంటపాడు: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 8న జరగనుంది. మండల పరిషత్ అధ్యక్షురాలు గవదకట్ల వెంకట లక్ష్మమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో తాగు, సాగునీరు, ఉపాధి హామీతో పాటు స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి సంబంధించి ఈ సమావేశం జరగనుంది. మండలంలో అవసరమైన మౌలిక వసతులు వాటి వివరాల పై చర్చ జరపనున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు ,జెడ్పిటిసి, సర్పంచులు అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఎంపీడీఓ చేవూరు శ్రీదేవి పిలుపునిచ్చారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు

ప్రజాశక్తి-కలిగిరి
పచ్చిశనగలు,ఎర్రశనగలు, కాబూలి, తెల్లశనగలు మండలంలోని రైతుభరోసా కేంద్రంలో వ్యవసాయ, ఉద్యానవన సహాయకుల ద్వారా రిజిస్ట్రేషన్ చేయబడునని వ్యవసాయ అధికారి సురేష్ బాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ శనగ పంట సాగు చేయు రైతులు 40శాతం రాయితీలో కొనుగోలు చేయుటకు రైతు ఆధార్ కార్డు అవకాశాన్ని పచ్చిశనగ సాగు చేయు రైతులందరు ఉపయోగించుకోవాలని తెలిపారు.

CHANGE OF NAME

I, SYED TAHSEEN (Old Name) Resident of D.No. 20-4-542, Meclence Road, Kotamitta, Nellore-524001, SPSR Nellore Dt, AP. Here by declare that I have Changed my name as **SYED TAHASEEN** (New Name) W/o. SYED IMTIYAZ ROZDAR.

కీర్తిశేషులు మాజీమంత్రి గౌతంరెడ్డికి నివాళులు

ప్రజాశక్తి-సంగం: బ్యారేజీ వద్ద కీర్తిశేషులు మేకపాటి గౌతమ్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి వైసీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేకపాటి గౌతమ్ రెడ్డికి జోహార్లు తెలిపారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు రఘునాథరెడ్డి మాట్లాడుతూ మేకపాటి గౌతంరెడ్డి మతి రాష్ట్రానికి తీరని లోటని అన్నారు.యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం ఆయన చేసిన కషి ఎనలేనిదని పేర్కొన్నారు. గౌతమ్ రెడ్డి ఆశయ సాధన కోసం ఆయన సోదరుడు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి ఎంతో కషి చేస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్మోహన్ రెడ్డి మరలా ముఖ్యమంత్రి కావడం ఖాయమని అదేవిధంగా ఆత్మకూరులో రెండో సారి ఎమ్మెల్యేగా మేకపాటి విక్రం రెడ్డి గెలుపొందడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సర్పంచ్ ల ప్రతినిధి చందన్ కుమార్ ,వైసీపీ నాయకులు ఫణీంద్ర రెడ్డి,రామారావు,రవీంద్ర బాబు, వేణు, శివ, నారసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు: కీర్తిశేషులు మాజీ మంత్రి మేకపాటి గౌతం రెడ్డి 52వ జయంతి సందర్భంగా చిలకపాడు, మర్రిపాడు లో మండల జెసిఎస్ కన్వీనర్ సిద్ధం రెడ్డి మోహన్ రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీర్తిశేషులు మంత్రి పాదయాత్ర ద్వారా ప్రజల తో మమేకమైవారి సమస్యలను తెలుసుకుని 2014 ఎన్నికల్లో పోటీ చేసి శాసనసభ్యులుగా ఎన్నికయ్యారన్నారు. 2019లో రెండవసారి శాసనసభ్యునిగా ఎన్నికై యువతకు నైపుణ్యా భివద్ధి సంస్థలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించారని పేర్కొన్నారు. కష్ణాపురంలో మాజీ సర్పంచ్ లక్ష్మి రెడ్డి, సిద్ధారెడ్డి రాంపల్లిలో వైసీపీ నాయకులు గౌతమ్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.కార్యక్రమంలో వైసిపి నాయకులు కొండారెడ్డి, రవి అన్వర్ బాషా, కేపీ నరసింహులు పాల్గొన్నారు.

మర్రిపాడులో

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: కీర్తిశేషులు మంత్రివర్యులు మేకపాటి గౌతమ్ రెడ్డి జయంతి సందర్భంగా గురువారం మున్సిపల్ బస్టాండ్ ప్రాంగణంలో స్థానిక వైసీపీ నాయకులు వార్డు కౌన్సిలర్లు , కార్యకర్తలు నడుమ గౌతమ్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో జిసిఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య , పట్టణ అధ్యక్షులు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో

చేజర్లలో

మాజీ మంత్రివర్యులు కీర్తిశేషులు మేకపాటి గౌతంరెడ్డి జయంతి సందర్భంగా మండల కేంద్రమైన చేజర్లలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చేజర్ల మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు తుమాటి విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జడ్పిటిసి పీర్ల పార్థసారథి, మండల నాయకులతో కలిపి భారీ కేక్ కట్ చేసి గౌతమ్ రెడ్డి జయంతిని జరుపు కున్నారు.కార్యక్రమంలో వేలూరు తిరుపతి నాయుడు, శ్రీనివాసులు నాయుడు, సుందరయ్య,తిరుపతి నాయుడు, పాడేరు సర్పంచ్ వెంకటేశ్వర్లు,వెంకటకృష్ణ పాల్గొన్నారు.

సచివాలయంలో పరిశీలన

ప్రజాశక్తి-అనంతసాగరం: మండల ంలోని కొత్తపల్లి గ్రామ సచివాల యంను ఎంపీడీఓ మధుసూదన్ రావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. గ్రామ వాలంటీర్లతో సమావేశం నిర్వహించి కేటాయించిన 50 కుటుం బా ల్లోని వారి సమస్యలను అధికా రులకు తెలియజేసి పరిష్కరిం చాలని సూచించారు. ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసి వారికి అందేలా సహకరించాలన్నారు. కార్యక్రమ ంలో గ్రామ సచివాలయ సిబ్బంది, వాలం టీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాహో ఫౌండేషన్ అండ

ప్రజాశక్తి-మర్రిపాడు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఒకరు మతి చెందినవారికి సాహో ఫౌండేషన్ ఆర్థిక సహాయం వారి భవిష్య త్‌కు సహాయ సహకారాలు అందిస్తా మని ఫౌండేషన్ అధినేత పి.నాగేశ్వర్రావు తెలియజేశారు. కళా శాల అభివద్ధి కోసం తన వంతు కషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఫౌండేషన్ అధినేత, ఫౌండేషన్ మెంబర్ ప్రమీలను అధ్యాపక బందం శాలువాలతో ఘనంగా సత్కరించారు.



స్వీట్లు పంపిణీ

ప్రజాశక్తి-ఉదయగిరి: చంద్రబాబు విడుదల సందర్భంగా అన్న క్యాంటీన్ వద్ద స్వీట్లను పంచిన కాకర్ల ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్. గురువారం నియోజక వర్గం తెలుగు దేశం పార్టీ నాయకులు ట్రస్ట్ వ్యవస్థాప కులు కాకర్ల సురేష్ నియోజక వర్గంలోని పేద ప్రజలకు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ లో రుచికరమైన భోజనం తోపాటుగా ప్రతి ఒక్కరికీ స్వీటును పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్ర బాబు నాయుడు విడుదలతో అన్ని వర్గాల ప్రజలు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంతోషం వ్యక్తం చేశారు. బాబు విడుదలతో వైసిపి ప్రభుత్వానికి వణుకు పుట్టిం దన్నారు. బాబు రాక జగన్ ప్రభుత్వం పతనానికి నాంది పలికిందని ధీమా వ్యక్తం చేశారు.

రికార్డులు పరిశీలన

ప్రజాశక్తి-ఉదయగిరి: కావలి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి పి రఘురామయ్య. గురువారం మండలంలోని జిల్లా ఉన్నత పాఠశాల కష్ణం పల్లి పాఠశాల వార్షిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ఉపాధ్యాయుల బోధనా తీరు, అకాడమిక్- నాన్ అకాడమిక్ కార్యకలాపాలు, కరికులర్ కో కరికులర్ కార్యకలాపాలు, పాఠశాల అభివద్ధికి అవసరమైన విద్యాపరమైన సూచనలు, పాఠశాల అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పాఠశాల అభివద్ధికి ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తీసుకున్న చర్యలను ప్రశంసిస్తూ అభినందించారు. అనంతరం ఆయనకు ఉపాధ్యాయులు ఘన సన్మానం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి 1 షేక్ మస్తాన్ వలి, జిల్లా ఉన్నత పాఠశాల కష్ణంపల్లి ప్రధానోపాధ్యాయులు డాక్టర్ శివరామిరెడ్డి, జిల్లా ఉన్నత పాఠశాల బసినేని పల్లి ప్రధానో పాధ్యాయులు అంజయ్య, జిల్లా ఉన్నత పాఠశాల గండిపాలెం ప్రధానోపా ధ్యాయులు వెంకటేశ్వర్లు, ప్యానల్ మెంబర్ లు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-ఉదయగిరి: నవంబర్ మూడున శుక్రవారం జరుగు స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్మెంట్ సర్వే పరీక్ష సామాగ్రిని మండల విద్యాశాఖ అధికారి 1 షేక్ మస్తాన్‌వలి సిఆర్ ఎంటి లకు అందజేశారు. ఈ సందర్భంగా సిఆర్ ఎంటిలచే పాఠశాల తరగతుల వారీగా గ్రేడింగ్ ప్యాకింగ్ చేయించి పరీక్ష జరుగు అన్ని పాఠశా లలకు సరఫరా చేయాలని వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్మెంట్ సర్వే పరీక్షకు ఎంపిక చేయబడిన 25 పాఠశాలల్లోని 3,6,9 తరగతుల విద్యార్థుల మొత్తం 767 విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని తెలిపారు.

కాంగ్రెస్ విజయం తథ్యం

ప్రజాశక్తి-కావలి: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం దిశగా అడుగులు వేస్తుందని, కేంద్రంలో ఈ సారి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయడం తథ్యమని కాంగ్రెస్ పార్టీ నాయ కులు, సీనియర్ న్యాయవాది చింతాల వెంకట్రావు తెలిపారు. గురువారం అయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ పార్టీ ఈ సారీ భారీ విజయం సాధించేందుకు , రాష్ట్రంలో ప్రధాన పార్టీలకు గట్టి పోటీ ఇచ్చే దిశగా అడుగులు ముందుకువేస్తుందని తెలిపారు.. సమావే శంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు లేళ్లపల్లి సురేష్ బాబు, అనుమాలు శెట్టి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-కలిగిరి
మండలంలో ఎంపిడిఒగా జి.వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు, ఇక్కడ పని చేస్తున్న కళాధర్ రావు జలదంకి మండలంకి బదిలీ అయ్యారు. మనుబోలులో విస్తరణ అధికారిగా విధులు నిర్వహిస్తూ కలిగిరి ఎం.పి.డి.ఒగా విధులకు హాజరయ్యారు.

In the Court of the I Addl. Junior Civil Judge : Nellore
O.S.No. 596 / 2021
UCO Bank, Represented by its Branch Manager, Brindavanam, Nellore City, SPSR Nellore District - Plaintiff
Vs
Kunapa Reddy Prasunna - Defendant
Notice
To,
Kunapa Reddy Prasunna,
W/o **K.Hari,** residing at
Flat No.3565, Block No.E,
Y.S.R. Nagar, Kothur, Nellore Bit-1,
SPSR Nellore District.
పై నెంబరున వాది మీ నుండి లోన్ బాకీ రాబట్టుకొనుటకు పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే17-11-2023ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
Sk. Yasdani, B.Com., L.L.B.,
వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.

In the Court of the I Addl. Junior Civil Judge : Nellore
O.S.No. 596 / 2021
UCO Bank, Represented by its Branch Manager, Brindavanam, Nellore City, SPSR Nellore District - Plaintiff
Vs
Kunapa Reddy Prasunna - Defendant
Notice
To,
Kunapa Reddy Prasunna,
W/o **K.Hari,** residing at
Flat No.3565, Block No.E,
Y.S.R. Nagar, Kothur, Nellore Bit-1,
SPSR Nellore District.
పై నెంబరున వాది మీ నుండి లోన్ బాకీ రాబట్టుకొనుటకు పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే17-11-2023ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
Sk. Yasdani, B.Com., L.L.B.,
వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.